క్లుప్తంగా

కళ్లజోళ్లు పంపిణీ



కంకిపాడు: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని తుమ్మలపల్లి పరమేశ్వర రావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల కంకిపాడులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో దృష్టి లోపాలు ఉన్న వారిని గుర్తించి ఆదివారం కళ్లజోళ్లు ఉచితంగా అందించారు. హరికృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ట్రస్టు ముందుండి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చలువాది రాజా గురవయ్య, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, తుమ్మలపల్లి నాగహరిచందన, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈ హరిబాబుకు అవార్డు



పెనమలూరు: ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబుకు ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీ భాస్కర్ ప్రతిభ అవార్డును ఈఈ పి.హరిబాబుకు అందజేశారు.

అన్నసమారాధన



పెనమలూరు: స్థానికంగా అయ్యప్పస్వామి అన్నసమారాధన కార్యక్రమం ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామంలో చాలా సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్నమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అయ్యప్పదీక్ష ముగిసిన తరువాత భక్తులు, దాతల సహకారంతో అయ్యప్పస్వామి అన్నసమారాధన చేశారు. సుమారు 25 వేల మంది వరకు భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చారు. భక్తులకు నిర్వహకులు పూర్తి సౌకర్యాలు కల్పించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



కంకిపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని వక్తలు సూచించారు. మండలంలోని గొడవర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య, క్రీడల్లో రాణించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. దాతలు ఏర్పాటు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వార్షిక వడ్డీ రూ. 38 వేలను గతేడాది, ఈ విద్యాసంవత్సరంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అండర్-17 బాలుర విభాగంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు బుస్కా అశ్విన్‌ను బంగారు, రజత పతకాలతో అభినందించారు. అండర్-14 కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం పొంది చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించిన నేషనల్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారిణి మిండే రిషితను రజత పతకంతో సత్కరించారు. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, హెచ్‌ఎం కె.సుబ్రమణ్యం, ఎస్‌ఎంసీ చైర్మన్ వక్కలగడ్డ రాము, స్థానిక నేతలు కోనేరు రాజేష్, మాదు వెంకటేశ్వర రావు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌జోన్ ఆటల పోటీల్లో ప్రతిభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సబ్‌జోన్ ఆటల పోటీల్లో సత్తా చాటారు. గన్నవరంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన సబ్‌జోన్ ఆటల పోటీల్లో వీరవల్లి క్రీడాకారులు కబడ్డీ, టెన్నికాయిట్, త్రోబాల్‌లో పతకాలు సాధించారు. సినియర్స్ విభాగంలో కబడ్డీ, త్రోబాల్ జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. జూనియర్స్ విభాగంలో టెన్నికాయిట్, త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని వీరవల్లి విద్యార్థులు సొంతం చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, వ్యాయామోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయీ బ్రెయిలీ అని న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ అధ్యక్షుడు జి.సీతా రామస్వామి అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో న్యూ లైఫ్ వెల్ఫేర్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపితే.. రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

- వాడవాడలా ఘనంగా గణతంత్ర దినోత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో



కంకిపాడులో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న సీఐ జె.మురళీకృష్ణ



ఉయ్యూరులో త్రివర్ణపతాకాన్ని ఎగురవేస్తున్న ఆర్డీవో హెలాషారోన్

కంకిపాడు: గణతంత్ర దినోత్సవం పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. అన్ని గ్రామాల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీ భావనారాయణ, పోలీసుస్టేషన్‌లో సీఐ జె.మురళీకృష్ణ, తెన్నేరు శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా జాతీయ పతాకాలను ఎగురవేశారు. అన్ని సంస్థలు, కార్యాలయాలు వద్ద గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.విగ్గిన్స్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు బి.సుగుణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ బేబీ సరోజిని, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచి కాటూరి సరళ, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి, భీమవరపు సుబ్బారెడ్డి, భీమవరపు ముత్తారెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు, సభ్యులు పాల్గొన్నారు. పాతపాడులో కార్యదర్శి పి.కోటిలింగమ్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచి దేవగిరి సుజాత, పాలకవర్గ సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. పి.నైనవరం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద గ్రేడ్-5 కార్యదర్శి ఎస్.సంతోష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి బట్టా సోమయ్య, పాలకవర్గ సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి డి.శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి గండికోట సీతయ్య, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా చేశారు. తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ భవానీప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపాలిటీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, మండల పరిషత్‌లో ఎంపీడీవో ప్రణవి, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిలత, పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ జె.వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో విశ్రాంత వింగ్‌కమాండర్ సజ్జానుసీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎన్‌సీసీ అధికారి ధాదుర్యానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు. వీఆర్‌సిద్ధార్థ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, క్రీడాకారులు కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశ్రామిక వేత్త సాగి కృష్ణంరాజు ఉత్తమ ప్రతిభ చాటిన 72 మంది విద్యార్థులు రూ.1.50 లక్షల నగదు ప్రొత్సాహకం అందజేశారు. హెచ్‌ఎం కనకదుర్గ, తల్లితండ్రులు పాల్గొన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశ్రామికవేత్త అన్నే శివనాగేశ్వరరావు ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సాయం, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.విజయలక్ష్మి, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు అజరయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: గణతంత్ర దినోత్సవం ఉయ్యూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఆర్డీఓ హేలాషారోన్ త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు భవనంపై న్యాయమూర్తి కె.శ్రీహరి, మున్సిపల్ కార్యాలయంపై కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో సీఐ రామారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్‌కుమార్ త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు.



రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో..



కేసరపల్లిలో వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ కె.కృపానందం జాతీయ జెండా ఎగురవేశారు. గణతంత్ర దినోత్సవ గొప్పదనం వివరించారు. పాఠకులు పాల్గొన్నారు. తెంపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్యకర్త కల్పన ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. సర్పంచ్ కొలుసు శిరీషా, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం భాస్కర్ పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నిడమానూరు, రామవరప్పాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. రామవరప్పాడు పంచాయతీ కార్యక్రమంలో జెండా వందనం చేసి అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: నియోజకవర్గవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన వేడుకలు జరిగాయి. జాతీయ జెండా అవిష్కరణతో పాటు గ్రామ పంచాయతీ కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, మాజీ ఎమ్మెల్యే ముల్పూరు బాలకృష్ణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు కట్టా వెంకటశివయ్య జెండా ఎగురవేశారు. అనంతరం విధి నిర్వాహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 20 మంది రెవెన్యూ సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.స్వర్ణలత, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంఈఓ కె.రవికుమార్, ప్రథమశ్రేణి గ్రంథాలయంలో కమిటీ సభ్యులు చిమట రామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ పతాకావిష్కరణ చేయగా, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్ల కవాతు ఆకట్టుకుంది.



పీవీపీ సిద్ధార్థలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో..

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: వణుకూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ.. సోమవారం పెనమలూరు సెక్షన్ వణుకూరు ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. గ్రామస్తులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 27వ తేదీ నుంచి ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ అనూష తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. ఈనెల 27, 28 తేదీల్లో కంకిపాడు సచివాలయం, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల, 29, 30 తేదీల్లో ఉప్పలూరు సచివాలయం, పునాదిపాడు సచివాలయంలో క్యాంపులు జరుగుతాయన్నారు. ఆరేళ్ల లోపు చిన్నారులు ఆధార్ నమోదుకు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ నేతల హర్షం

గన్నవరం: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..సమాజంలో మారుమూల నివాసించే జాతిని ఏబీసీడీ వర్గీకరణ పేరుతో కృష్ణ మాదిగ చైతన్యపరిచారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని నిర్మించిన ఆయన మాదిగలకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆచరణలో అమలు జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. సంఘ నేతలు బత్తుల శివయ్య, తిరివీధి పాపారావు, అజయ్, కొలకలూరి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24న బెంగాల్‌కు చెందిన అశోక్‌లామా పోరంకిలో బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి పెనమలూరు వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతని జేబులో ఆధార్ కార్డు ఆధారంగా పేరు చిరునామా తెలియటంతో బెంగాల్‌లో కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి రంగాబొమ్మ ప్రాంతంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సంజయ్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను పానీపూరి వ్యాపారం చేస్తాడు. అతని భార్య హీరాదేవికి మానసిక స్థితి సక్రమంగా లేకపోవటంతో వైద్యం చేయిస్తున్నాడు. ఈ నెల 22వ తేదీన సంజయ్ పానీపూరి వ్యాపారం చేయటానికి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అయితే అతని భార్య హీరాకుమారి ఇంట్లో లేదు. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్న బంధువులను వాకబు చేయగా ఆమె యూపీకి రాలేదని తెలిపారు. భార్య కనిపించక పోవటంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. అయ్యప్పనగర్‌కు చెందిన అవివాహితుడు బేతు ప్రశాంత్‌కుమార్ (26) ఆటోనగర్‌లో టింకరింగ్ పనులు చేస్తాడు. ఈ నెల 23న బైక్‌పై యనమలకుదురుకు వస్తూండగా ఆటో ఢీ కొట్టింది. ఆ తరువాత తను ఇంటికి వెళ్లాడు. 24వ తేదీన తల నొప్పిగా ఉండటంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోని ఇంటికి వచ్చాడు. మరలా ఆరోగ్యం క్షీణించటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. అతను అపస్మారకస్థితిలో ఉన్నాడు. ఈ ఘటనపై బావ కొసనం విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

గణతంత్ర దినోత్సవంనాడు నిషేధం అమలు చేయలేని అధికారులు



పోరంకిలో మటన్ విక్రయిస్తున్న దృశ్యం

పెనమలూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా తాడిడప మున్సిపాలిటీ పరిధిలో మాంసం అమ్మరాదని కమిషనర్ భవానీప్రసాద్ ఆదేశాలను ఎవరూ పట్టించుకోలేదు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఆదివారం మాంసం విక్రయాలు జరిగాయి. మున్సిపాలిటీ ప్రాంతంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా మటన్, చికెన్, చేపలు, ఇతర మాంసం అమ్మకాలు చేయరాదని కమిషనర్ శనివారం ప్రకటన చేశారు. సిబ్బంది నిఘా ఉంటుందని చెప్పారు. అయితే కమిషనర్ ఆదేశాలను వ్యాపారులు బేఖాతర్ చేశారు. మున్సిపాలిటీ కార్యాలయం ఉన్న ప్రాంతంలోనే మాసం విక్రయాలు జోరుగా జరిగినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూశారు. మున్సిపాలిటీలో పాలన అదుపుతప్పిందని చెప్పటానికి ఇదో నిదర్శనంగా ఉంది.

అక్రమ మద్యం విక్రయాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అక్రమ మద్యం విక్రయాలు జోరుగా పెరిగాయి. మద్యం దుకాణాలు తెరవ కుండా బెల్టు షాపుల్లో మద్యం ధర పెంచి అమ్మకాలు చేశారు. మద్యం ధర పెంచి అమ్మకాలు చేయటంతో మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం పలు మద్యం షాపుల్లో కూడా మద్యం అమ్మారు.

అజెండాలో ఎనికేపాడు చెరువు అంశం

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక 190/1లో 2.26 ఎకరాల విస్తీర్ణంలో గల చెరువులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి పాలకవర్గ సభ్యుల తీర్మానం నిమిత్తం సోమవారం జరగనున్న పంచాయతీ సాధారణ సమావేశంలో 75వ అంశంగా చెర్చడం పట్ల పలువురు అభ్యంతరం వెలుబుచ్చుతున్నారు. ఈనెల 18న సాక్షిలో 'చెరువు ఆక్రమణకు స్కెచ్' పేరిట కథనం ప్రచురితమైంది. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి పంచాయతీ తీర్మానానికి, చెరువు ఆక్రమించడానికి టీడీపీ నాయకులు ఏ విధంగా ప్రణాళిక రూపొందించారో వివరిస్తూ ముందుగానే కథనం ద్వారా వివరించింది. చెరువు కనుమరుగైపోతుందన్న నిజాన్ని గ్రామస్తులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. గ్రామం పుట్టినప్పటి నుంచి ఉన్న చెరువును ఏ విధంగా ఆక్రమిస్తారంటూ గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకుల స్వార్థ ప్రయోజనాలు, తమ సొంత పొలాలకు ధరలు పెంచుకోవడం కోసం చెరువును సైతం వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఈ అంశం తీర్మానం పొందడానికి పాలకవర్గ సభ్యులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. సుప్రీం కోర్టు నిబంధనలకు విరుద్ధంగా చెరువు ఆక్రమిస్తే చూస్తూ ఊరుకోమని ఈ సందర్భంగా గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

కల్లుగీత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మృతి



వీరరాఘవులు భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ (ఇన్‌సెట్లో) వీరరాఘవులు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పెద్ద గౌడ్ ఆరేపల్లి వీర రాఘవులు (83) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా రాఘవులు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆవిర్భావం నుంచి సంఘంలో అధ్యక్షుడిగా గతంలో చురుకుగా పని చేసిన వీరరాఘవులు గీతవృత్తి నుంచి వైదొలిగారు. వీరరాఘవుల కుటుంబం అనాదిగా నున్న గ్రామ పెద్ద గౌడ్ పదవిని అధిరోహిస్తూ వస్తోంది. వీరరాఘవులు మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ పెద్ద గౌడ్ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు కలకోటి శ్రీనివాసరెడ్డి, మాదు శివరామప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, ఏపీ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు మాదు వీరాంజనేయులు నివాళులర్పించారు.

క్రీడాదుస్తులు అందజేత



ఉంగుటూరు: ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వవిద్యార్థులు రూ.25 వేలు వితరణగా ఆదివారం అందజేశారు. పూర్వ విద్యార్థి వెనిగళ్ల కృష్ణమూర్తి పెద్ద కుమారుడు వెంకటప్రసాద్, కుమార్తె శ్రీలక్ష్మి విద్యార్థుల క్రీడాదుస్తుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. మరో పూర్వ విద్యార్థి బెజవాడ వీరశంకర్‌రావు రూ.15 వేలు హెచ్‌ఎం సీతారామ్‌కు అందజేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యం కావాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

కంకిపాడు: రాజ్యాంగ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కంకిపాడు లాకుల వద్ద రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పాతూరి చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక విధానం పాలకుల అజెండాగా మారిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ రక్షణే దేశ రక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సరిహద్దు అంథోని, రామకృష్ణ, జి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల కుదింపు ఎఫెక్ట్

ఇబ్బందులు పడుతున్న రైతులు



ట్రాక్టరుకు ఇంజిను బిగించి ట్యూబుల ద్వారా నీటిని పొలానికి తరలిస్తున్న దృశ్యం

కంకిపాడు: సాగునీటికి రైతులు పడుతున్న ఇక్కట్లకు నిలువెత్తు సాక్ష్యం ఈ దృశ్యం. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బొట్ట రాజగోపాల్‌రెడ్డి ప్రొద్దుటూరు- దావులూరు మధ్యన వంతెన కాలువ వెంబడి ఎకరంన్నర విస్తీర్ణంలో నువ్వులు, రెండెకరాల్లో మినుము పంట వేశారు. పంటకు అవసరమైన నీటి తడుల కోసం పక్కనే ఉన్న వంతెన కాలువే దిక్కయ్యింది. కాలువలో అడుగున ఉన్న నీటిని ట్రాక్టరుకు ఇంజిన్ తగిలించి ట్యూబుల ద్వారా పొలంలోకి మళ్లించి పంటను సంరక్షించు కుంటున్నారు. బోర్లకు వ్యవసాయ విద్యుత్ వేళల కుదింపుతో రైతులు పడుతున్న ఇక్కట్లకు సాక్ష్యమిది. 18 గంటల పాటు నీటి తడులు ఇస్తేనే చేనుకు మేలు జరుగుతుందని రైతు రాజగోపాల్‌రెడ్డి వివరించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఉంగుటూరు: క్విజ్ పోటీల వలన విద్యార్థుల్లో మనో ధైర్యం లభిస్తుందని అవనిగడ్డ ప్రగతి విద్యాసంస్థల అధినేత పూర్ణచంద్రరావు అన్నారు. గన్నవరం నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలలో స్రవంతి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని నిర్వాహకులు ప్రిన్సిపాల్ కేజీ ఎస్.సాయి బాబా తెలిపారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి సాయిశ్రీనివాస హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు శనివారం జరిగాయి. గన్నవరం స్రవంతి హైస్కూల్ ప్రథమ స్థానం, వీరవల్లి విశ్వభారతి రెండవ స్థానం, హనుమాన్‌జంక్షన్ గీతాంజలి హైస్కూల్ మూడవ స్థానం దక్కించుకున్నాయి. అనంతరం విద్యార్థులకు నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ పోటీలలో మొత్తం 21 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున విద్యాసంస్థల అధినేత ఎన్‌సీహెచ్‌వి.రాయుడు, స్రవంతి ప్రిన్సిపాల్ రామకృష్ణ, గీతాంజలి ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.